క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట రూరల్: మండలంలోని పల్కపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఆంజనేయులు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పల్కపల్లి, పోలిశెట్టిపల్లి, మహదేవ్‌పూర్, సీతారాంపూర్ గ్రామాలకు అంతరాయం ఉంటుందనారు. రైతులు, వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

సామూహిక వ్రతాలు

నాగకర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం ఉదయం 10:30 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సీసీ కెమెరాలతో నేరాలు అదుపు

చారకొండ: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తద్వారా నేరాలు అరికట్టవచ్చని చారకొండ ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు భద్రతపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల నిఘా ఉండేలా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు మ్యాట్ బహూకరణ



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో క్రికెట్ ఆడే క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు క్రికెట్ మ్యాట్‌ను మిత్ర ఫౌండేషన్ సహకారంతో క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడారు. స్టేడియం గ్రౌండ్‌లో క్రికెట్ ఆడటానికి వచ్చే క్రీడాకారులకు మ్యాట్ లేకపోవడంతో ఆటకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో తాము సహకారం అందించామన్నారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆకుతోట నరేష్, శ్రీకాంత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దకొత్తపల్లి: వెనచర్లకి చెందిన భవనం నిర్మాణం మేస్త్రీ శ్రీనివాసులు కుమారుడు శివుడు బుధవారం ఆకస్మికంగా మృతిచెందాడు. మృతుని కుటుంబానికి తాపి మేస్త్రీ యూనియన్ సభ్యులంతా రూ.22 వేలను మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, తిరుపతయ్య, కురుమయ్య, రామకృష్ణ, శివ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

24న బల్మూర్ మండల సర్వసభ్య సమావేశం

బల్మూర్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24న శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అరుణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

అనుమతి లేని నిర్మాణాలు చేపడితే చర్యలు

కొల్లాపూర్: కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. మున్సిపాలిటీలో నూతనంగా నిర్మాణాలు చేపట్టే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టేవారికి అపరాధ రుసుం విధించడం జరుగుతుందన్నారు. రహదారులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చి వేస్తామన్నారు.

క్రికెట్ శిక్షణా శిబిరం పూర్తి



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నెల రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరం పూర్తయిందని నాగర్‌కర్నూల్ శిక్షణ శిబిరం ఇన్‌చార్జ్ మహ్మద్ మొహసిన్, సతీష్ బుధవారం తెలిపారు. ఏప్రిల్ 21న ప్రారంభమైన క్రికెట్ శిక్షణ శిబిరం మే 22 వరకు కొనసాగిందని చెప్పారు. శిబిరంలో 110 మంది యువకులు శిక్షణ పొందినట్లు చెప్పారు.

సర్వేతో సరిపెట్టారు

- నిలిచిపోయిన జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణ పనులు
- కరువుతో అల్లాడుతున్న రైతులు
- రిజర్వాయర్ నిర్మాణం చేపడితే అందుబాటులోకి సాగు, తాగునీరు



జాతరకుంట రిజర్వాయర్ నిర్మించే ప్రదేశం

పెద్దకొత్తపల్లి: కేఎల్ఐ ప్రాజెక్ట్ కింద ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల కోసం 42 చెరువు కుంటలను ప్రభుత్వం సర్వే చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. కరువుతో అల్లాడుతున్న రైతులకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 42 చెరువు కుంటలను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చేందుకు సర్వే చేయించారు. అందులో పెద్దకొత్తపల్లికి చెందిన జాతర కుంట రిజర్వాయర్ ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేఎల్ఐ ప్రాజెక్ట్‌పై నిర్మించే 42 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను కుదించి 22 రిజర్వాయర్లకు పరిమితం చేసింది. 22 రిజర్వాయర్లకు కూడా ఈ జాతరకుంట రిజర్వాయర్ ఉంది. ప్రస్తుతం ఎక్సైజ్ శాఖ మంత్రి ఉన్న జూపల్లి కృష్ణారావు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి క్యాబినెట్‌లో జూపల్లి కృష్ణారావు పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2012 జాతర కుంట గండి రిజర్వాయర్‌కు సర్వే చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణంతో పెద్దకొత్తపల్లి మండలంలోని 10 వేల ఎకరాలకు కరువులో సాగునీరు అందించడంతో పాటు 15 గ్రామాలకు సాగునీటిని అందించవచ్చు.

– కుమ్మరిగుట్టలో ఉన్న జాతర కుంటకు ఆ గట్టుకు ఈ గట్టుకు కట్ట నిర్మాణం చేపడితే అర టీఎంసీ నీటిని నిల్వ చేసుకోవచ్చు. ఈ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో రైతుల భూములు తక్కువగా ఉన్నాయి. కేవలం 56 ఎకరాలకు మాత్రమే ప్రభుత్వం డబ్బులు చెల్లించాల్సి ఉంది. మిగతా భూములన్ని ప్రభుత్వ భూములే కావడంతో జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణం చేపడితే కరువు సమయంలో రెండేళ్ల పాటు రైతులకు సాగునీరు అందించవచ్చు. ఈ రిజర్వాయర్ కేఎల్ఐ కాల్వ పక్కన ఉండటంతో వర్షాలు ఎక్కువగా కురిసి వరద సమయంలో రిజర్వాయర్‌లోకి నీటిని కాల్వ ద్వారా వదులుకోవచ్చు. ఈ రిజర్వాయర్ నుంచి కాల్వల ద్వారానే పెద్దకొత్తపల్లి, బాచారం, జొన్నలబొగుడ, సాతాపూర్, కొత్తపేట, కల్వకోల్, చెన్నపురావుపల్లి, గంట్రావ్‌పల్లి, నారాయణపల్లి, యాపట్ల, మారేడుమాన్‌దిన్నె గ్రామాలకు సాగునీరును అందించవచ్చు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ జిల్లా వాసి సీఎం అయినా.. రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని రైతులు కోరుతున్నారు.

వరద సమయంలో నీటిని నింపొచ్చు..



జాతర కుంట రిజర్వాయర్ నిర్మాణం చేపడితే కేఎల్ఐ ప్రాజెక్టుకు వరద నీరు వచ్చే సమయంలో ఎక్కువ నీరును ఈ రిజర్వాయర్‌లోకి కాల్వ ద్వారా నింపేందుకు అవకాశం ఉంటుంది. కరువు వచ్చినప్పుడు ఈ రిజర్వాయర్ నుంచి నీటిని రైతులకు వదులవచ్చు.

– లింగారెడ్డి, రైతు, పెద్దకొత్తపల్లి

తక్కువ ఖర్చుతో రిజర్వాయర్ నిర్మాణం..



కుమ్మరిగుట్టలోని ఆ గుట్టకు ఈ గుట్టకు మధ్య జాతర కుంటకు కట్ట వేస్తే గుట్టల మధ్య అర టీఎంసీ నీటిని నింపుకోవడానికి వీలు ఉంది. ఈ రిజర్వాయర్ నిర్మాణంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ఇబ్బందులు లేవు. తక్కువ ఖర్చుతో నిర్మాణాన్ని చేపట్టేలా ఉంది.

– వెంకటేష్ రైతు పెద్దకొత్తపల్లి

ఆన్‌లైన్ మోసాలు అరికట్టడం అందరి బాధ్యత



మాట్లాడుతున్న వెంకటేశ్వర శర్మ

నాగర్‌కర్నూల్ క్రైం: ఆన్‌లైన్ మోసాలను అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యత అని బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర శర్మ అన్నారు. గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని కిసాన్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మతపెద్దలు, కమ్యూనిటీ లీడర్స్, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్‌తో ఆన్‌లైన్ మోసాలపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటితో అందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బాలికలు సోషల్ మీడియాలో తెలియని వారితో స్నేహం చేయవద్దన్నారు. బాల్యవివాహాలు నిర్మూలించడానికి ప్రతిఒక్క బ్రాహ్మణులు, కాజీలు వివాహం జరిపించేటప్పుడు అమ్మాయి, అబ్బాయి సర్టిఫికెట్స్ చూడాలన్నారు. జిల్లా ఖాజీ అధ్యక్షుడు అబ్దుల్లా, బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ లక్ష్మణరావు, చంద్రశేఖర్ శర్మ, రాజశేఖర్ శర్మ పాల్గొన్నారు.

భాగ్యారెడ్డివర్మకు ఘన నివాళి

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలో బుధవారం అంబేద్కర్ ఐడియలాజీ మిషన్ ఆధ్వర్యంలో మాదిరి భాగ్యారెడ్డివర్మ 136వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కులమత వ్యవస్థకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాటం చేసిన నిజమైన ఆది హిందువులు మూలవాసులేనని పేర్కొన్నారు. 1910 నుంచి 1933 వరకు 26 పాఠశాలలు స్థాపించిన మూలభారతీయుడు భాగ్యారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహ, మంజుల, శివలీల, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు తనిఖీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌తండా గ్రామపంచాయతీలో ఎంపీడీఓ వెంకట్‌రాములు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలకు సూచనలు ఇచ్చారు. అనంతరం గ్రామంలో పర్యటించి తాగునీరు నల్లా చుట్టూ మురుగు నిల్వ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. నర్సరీని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శిని ఆదేశించారు. తర్నికల్ తండాలో ఇరిగేషన్ షెడ్ నిరుపయోగంగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేపూరు గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చారకొండ: మండలంలోని గోకారం, చంద్రాయన్‌పల్లి, మర్రిపల్లి గ్రామాలను బుధవారం ఎంపీఓ వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీల పరిశీలన వాటి సంరక్షణ తదితర వాటిపై ఆరా తీశారు. వచ్చే హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో కంపోస్టు షెడ్లు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు పరిశీలించి వాటి నిర్వహణ తదితర వాటిపై పంచాయతీ కార్యదర్శులతో మట్లాడారు. గ్రామాల పంచాయతీలో రికార్డులు తనిఖీ చేశారు. నిత్యం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవులు, శ్రీపని, రవిశంకర్ ఉన్నారు.



గోకారంలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

పెద్దకొత్తపల్లి: లోక్ సభ ఎన్నికల సందర్భంగా చిన్నకార్పాములలో బీజేపీ కార్యకర్త గన్యాగుల విజయ్‌పై అదే గ్రామానికి చెందిన మైసమ్మ చైర్మన్ శ్రీనివాసులు అతని అనుచరులు దాడి చేయగా.. వారిపై గన్యాగుల విజయ్ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించారు. నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ బుధవారం గ్రామానికి వెళ్లి గ్రామపంచాయతీ వద్ద బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల అనంతరం ప్రజలు దాడులకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని సూచించారు. గొడవలు పడితే మీరే నష్టపోతారని సూచించారు. విచారణలో ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



మాట్లాడుతున్న కృష్ణయ్య

అచ్చంపేట రూరల్: నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని, లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం అచ్చంపేటలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో లైసెన్సు కల్గిన డీలర్లతో సమావేశం నిర్వహించారు. డీలర్లు అందరూ రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మాలన్నారు. తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు అమ్మకాలు జరిపినా, ఎలాంటి అనుమతులు లేకుండా, లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు.

ఘనంగా ప్రథమ వార్షికోత్సవ పూజలు



హోమాలు నిర్వహిస్తున్న దంపతులు

లింగాల: మండల పరిధిలోని దారారం శ్రీరామాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రథమ వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. ఏడాది కిందట ఆలయాన్ని పునఃప్రారంభించి వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులతో ప్రథమ వార్షికోత్సవ వేడుకలను జరుపుకొన్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య దంపతులతో హోమాలు, అభిషేకాలు, ఇతరత్రా దైవ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంపతులు కవిత, శ్రీనివాసులు, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతతో పనిచేస్తేనే అభివృద్ధి

ఉప్పునుంతల: నీతి నిజాయతీకి దగ్గరగా ఉంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేస్తేనే అభివృద్ధి అనేది వందశాతం సాధ్యపడుతుందని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతగంటి రాములు అన్నారు. బుధవారం ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీ, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, సమస్యలపై చర్చించారు. పంటల సాగులో పచ్చిరొట్ట ఎరువు కోసం వినియోగించే జీలుగ విత్తనాలు అందబాటులో ఉంచాలని, అదేవిధంగా చెరువు కాల్వలను పునరుద్ధరించాలని వెల్టూరు ఎంపీటీసీ రంగారెడ్డి కోరారు. పూర్యానాయక్ తండాలో సరిపడా పైప్‌లైన్ లేకపోవడతో తాగునీటి సమస్యతో తండా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెనిమిళ్ల ఎంపీటీసీ భాస్కర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పిల్లలకు, బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం సరిగా అందడంలేదని పిరట్వానిపల్లి ఎంపీటీసీ బూరం మల్లేష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సరైన ఆధారాలు ఉంటే సంబంధిత అంగన్‌వాడీ టీచర్లపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు మాట్లాడారు. దుందుభీ వాగు నుంచి అక్రమ ఇసుకను నియంత్రించకుంటే భవిషత్‌లో ఇబ్బందులు ఏర్పడుతాయని, ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. నియోజకర్గంలో ఆస్పత్రుల కోసం పెద్దపెద్ద భవనాలు నిర్మించినా.. అందులో సరైన వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడతో పేద ప్రజలకు వైద్యం అందించలేని పరిస్థితిలో ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఎంపీ రాములును ఆదర్శంగా తీసుకొని తన రాజకీయ సేవలు అందిస్తానని తెలిపారు. విద్య, వైద్యం, ఇరిగేషన్, పరిశ్రమల ఏర్పాటుపైనే తాను ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అదేవిధంగా మండల సమావేశానికి హాజారు కాకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు కలెక్టర్‌కు రిపోర్టు పంపించాలని ఎంపీడీఓకు సూచించారు. అనంతరం ఎంపీ రాములును సన్మానించారు. సమావేశంలో జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హేమలత పాల్గొన్నారు.



ఉప్పునుంతల మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఘనంగా అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం



మొక్కలు నాటుతున్న చెంచు ప్రగతి కేంద్ర కమిటీ

బల్మూర్: మండలంలోని చెంచుగూడెంలో బుధవారం కోనేర్ సంస్థ ఆధ్వర్యంలో చెంచు ప్రగతి సేవా కేంద్ర కమిటీ సభ్యులతో కలిసి అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కోనేరు సంస్థ ప్రాజెక్ట్ కో- ఆర్డినేటర్ పెద్దులయ్య పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజలకు, విద్యార్థులకు, యువకులు, మహిళలకు అవగాహన కల్పించారు. అడవుల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయం, నీరు, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధాన రహదారికి ఇరువైపుల మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, దేవమ్మ, ఐకేపీ సీసీ రాజు, ఆశ కార్యకర్త అంజమ్మ, మేట్ కొండల్ పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయంలో సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న జిల్లా అధికారులు

కోడేరు: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో 2023–24 సంవత్సరం వరకు ఎంత ఖర్చు చేశారు. రికావరీ ఎంత చేశారు అనే దానిపై బుధవారం జిల్లా మైక్రో ఫైనాన్స్ అధికారులు శ్యాంసుందర్, సురేష్, భార్గవ్ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండలంలో స్త్రీనిధి కింద రూ.3 కోట్ల రుణం ఇవ్వడం కోసం లక్ష్యం పెట్టుకోగా.. రూ.2 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మహిళా సమాఖ్య ద్వార గ్రామ సంఘాలకు కోడేరు, తీగలపల్లి, పస్పుల, మాచుపల్లి, రాజాపూర్, రేకులపల్లి, ఎత్తంలో రూ.14 లక్షల రుణాలు ఇచ్చామన్నారు. తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడంపై సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు.

గ్రామ పునరావాసానికి సహకరించాలి



ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న నాయకులు

మన్ననూర్: గ్రామ పునరావాసానికి సహకరించాలని గ్రామ పునరావాస కమిటీ అధ్యక్షుడు సాయిబాబు ఆధ్వర్యంలో అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి గ్రామస్తులు బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా పునరావాసం కోరుకుంటున్న సందర్భాన్ని బట్టి పలు విషయాలను ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఆయన అన్ని విధాలుగా నా సహకారం ఉంటుందని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పునరావాస కమిటీ, గ్రామస్తులు సాధిక్, చత్రునాయక్, జూలునాయక్, బాలకృష్ణ, లక్ష్మణరాజు, బాలస్వామి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ మేటీలను గుర్తించాలి



మాట్లాడుతున్న మేకల ఆంజనేయులు

నాగర్‌కర్నూల్ రూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సీనియర్ మేట్‌లను క్షేత్రసహాయకులుగా గుర్తించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మేకల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సీనియర్ మేట్‌లుగా కొనసాగుతున్న వారితో పనిచేయిస్తూ ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మేటీలతో కలిసి ఆర్డీఓ ఏఓ ప్రతాప్‌రెడ్డికి వినతి అందజేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



వెల్దండ మండలం బైరాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

అమ్రాబాద్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పదరలో శ్రీ రామాలయంలో బుధవారం శ్రీ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో వెంకటేష్ వారి కుటుంబ సభ్యులు లక్ష్మీనృసింహస్వామి వార్లకు వస్త్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. ముఖ్య అతిథులుగా వచ్చిన విశ్వహిందు పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు సంబు వెంకటరమణ, శోభలను శాలువాలతో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని కొల్లాపూర్ చౌరస్తాలోని శ్రీదత్త లక్ష్మీనర్సింహస్వామికి బుధవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారి ఆలయంలో భజన కార్యక్రమాలు కొనసాగాయి.

బైరాపూర్‌లో ప్రత్యేక పూజలు

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో బుధవారం మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు చప్పట్లే ప్రోత్సాహం

నాగర్‌కర్నూల్ క్రైం: ఒక సినిమాను నిర్మించాలంటే పగలు రాత్రి తేడా లేకుండా పాత్రలో విలీనమై డైరెక్టర్, నిర్మాతతో పాటు ఆర్టిస్టులు కష్టపడి ఒక సినిమాను నిర్మిస్తారని వారు పడ్డ కష్టాన్ని మర్చిపోవాలంటే ప్రేక్షకుల చప్పట్లే ప్రోత్సాహాన్ని ఇస్తుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో ఐ20 సినిమా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వనపర్తి జిల్లాలో జరిగిన యదార్థ సంఘటనలను కథగా తీసుకొని సినిమాలను నిర్మించినందుకు డైరెక్టర్ నిర్మాతలను ఆయన అభినందించారు. సినిమాలో నటించిన వారందరూ నాగర్‌కర్నూల్ కళాకారులు కావడం సంతోషంగా ఉందని అన్నారు. నాగర్‌కర్నూల్‌లో కూడా హైదరాబాద్ తరహాలు రవీంద్ర భారతి భవనాన్ని ఏర్పాటు చేసి సినీ కళాకారులకు అవార్డులు వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హీరో సూర్యరాజ్, సుహానా, డైరెక్టర్, సూరిరవీందర్, నిర్మాత మహేందర్ పాల్గొన్నారు.



ఐ20 సినిమా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్